సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు(2025) సన్నద్ధమయ్యే అభ్యర్థులకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఆబ్జెక్టివ్ విధానంలో ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపికను చేపట్టనున్నట్టు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు మించకూడదని, ఈనెల 13 నుంచి 30లోపు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు http:// studycircle.cgg.gov.in,http:// twd.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ఒక్కక్లిక్‌తో మెడికల్ కాలేజీల సమాచారం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల సమస్త సమాచారాన్ని తమ వెబ్‌సైట్‌లో పొందుపరుచాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. ఇప్పటివరకు కాలేజీల పేరు, అడ్రస్, ఎప్పుడు అనుమతులు వచ్చాయనే ప్రాథమిక వివరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇకపై ఆయా కాలేజీల భవనాలు, మౌలిక వసతులు, సిబ్బంది వివరాలు తదితర సమస్త సమాచారాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లోని యాన్యువల్ డిక్లరేషన్ అనే ట్యాబ్/లింక్‌లో ఈ వివరాలు ఉంటాయని వెల్లడించింది.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీ భాషలో శిక్షణ

హైదరాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ): జర్మనీలో ఉద్యోగం చేయాలనుకునే నర్సింగ్ అభ్యర్థులకు ఆ దేశభాషలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 15లోగా తమ వెబ్‌సైట్(టామ్‌కామ్) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఎంపికైన అభ్యర్థులకు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగం లభిస్తుందని పేర్కొంది. 21-38ఏండ్ల ఉండి, గుర్తింపు పొందిన కాలేజీ నుంచి నర్సింగ్, ఐసీ యూ, జెరియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, నియోనాటల్, సర్జికల్, సైకియాట్రిక్ లో కనీసం 1-3 ఏండ్ల అనుభవం ఉన్నవారు, వివరాలకు 63022 92450, 99088 30438, 84999 90304 నంబర్లను సంప్రదించాలి.

రైల్వే డిగ్రీ కాలేజీలో బీబీఏ, బీకామ్ ఫైనాన్స్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రైల్వే డిగ్రీ కాలేజీలో కొత్తగా రెండు డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు బుధవారం దక్షిణ మధ్య రైల్వేజోన్ అధికారులు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి బీబీఏ, బీకామ్(కామర్స్) కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ డిగ్రీ కాలేజీలో బీకామ్(జనరల్), బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ(ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్) కోర్సులను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్న రైల్వే డిగ్రీ కాలేజీలో అడ్మిషన్ల కోసం దోస్త్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు 'ఓపెన్' ఫలితాలు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్ష ఫలితాలు గురువారం విడుదలకానున్నాయి. ఉదయం 11 గంటలకుఫలితాలను www. telanganaopenschool.org వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని డైరెక్టర్ పీవీ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలను ఏప్రిల్, మేలో నిర్వహించారు.

రేపటితో ముగియన్న ఈసెట్ వెబ్ ఆప్షన్ల గడువు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఈసెట్ వెబ్‌కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. వెబ్ ఆప్షన్ల గడువు ఈనెల 14తో ముగుస్తుంది. 18లోపు సీట్లను కేటాయిస్తారు. ఇప్పటివరకు 12,352 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాగా, 4,759 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నట్టు అధికారులు తెలిపారు.

బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

- కామారెడ్డిలో అక్రమ నిర్మాణం తొలగింపుపై రచ్చ
- మిగిలిన కట్టడాలను వదిలేయడంపై ఎమ్మెల్యే ఫైర్
- ఎమ్మెల్యే కాటిపల్లితో కాంగ్రెస్ కౌన్సిలర్ వాగ్వాదం



మున్సిపల్ కార్యాలయంలో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే కాటిపల్లి, కాంగ్రెస్ కౌన్సిలర్

కామారెడ్డి, జూన్ 12: కామారెడ్డిలో అక్రమంగా నిర్మించిన ఓ హోటల్ కూల్చివేత కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. అక్రమ నిర్మాణాలన్నింటిపైనా చర్యలు చేపట్టకుండా కేవలం ఒకే ఒక్క నిర్మాణాన్ని కూల్చడంపై స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ నేతలు మున్సిపల్ అధికారులను నిలదీశారు. ముందుగా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతల అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. అసలేం జరిగిందంటే.. కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీలో అక్రమంగా నిర్మించిన వసుధ హోటల్‌ను మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. కేవలం ఒక్క నిర్మాణాన్నే కూల్చి మిగతా వాటిని వదిలేయడంపై ఎమ్మెల్యే కాటిపల్లి, బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపల్ ఆఫీసుకు వచ్చి కమిషనర్ సుజాతను నిలదీశారు. రాజకీయ కక్షతోనే ఇలా చేస్తున్నారని, కాంగ్రెస్ నేతల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. అక్కడి నుంచే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఫోన్ చేసిన కాటిపల్లి.. ప్రజల నిర్మాణాలను కూల్చాలని ఆదేశించారా? అని ప్రశ్నించగా.. తానేమీ చెప్పలేదని ఆయన సమాధానమిచ్చారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం మొదలై దూషణల వరకు వెళ్లింది. ఎమ్మెల్యే తమ కౌన్సిలర్లకు సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఆ తర్వాత ఎమ్మెల్యే కాటిపల్లికి, కాంగ్రెస్ కౌన్సిలర్ పాత కృష్ణమూర్తి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అక్రమంగా నిర్మించిన వసుధ హోటల్‌ను కూల్చివేయడాన్ని ఎమ్మెల్యే అడ్డుకోవడం సరికాదని కృష్ణమూర్తి అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన నోటీసుల ప్రకారమే అధికారులు కూల్చివేతలు చేపట్టారని, అప్పుడు నోటీసులు ఇచ్చి ఇప్పుడు వద్దనడం సరికాదని పేర్కొన్నారు.

తన్నుకున్న మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులు

కన్నాలలో ఉద్రిక్తత.. ఠాణాలో ఫిర్యాదు.. ఇద్దరిపై కేసు

పాలకుర్తి, జూన్12: వారిద్దరూ మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులు. ఒకరు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య.. మరొకరు పెద్దపల్లి డీసీసీ సంయుక్త కార్యదర్శి గౌసియాబేగం. ఇందులో సమ్మయ్య అనుచరులు సూర సంతోష్, ఓల్లెపు రమేశ్.. గౌసియాబేగం సోదరుడు ఆరిఫ్ పాషాపై దాడి చేశారు. ఈ గొడవ బసంత్‌నగర్ ఠాణాకు చేరింది. బుధవారం రాత్రి బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద గౌసియాబేగం మాట్లాడుతూ.. సూర సమ్మయ్య కాంగ్రెస్‌లో ఉంటూనే.. పార్టీ శ్రేణులపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. డబ్బు, అధికార బలంతో చిన్న స్థాయి నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. బయ్యపు మనోహర్‌రెడ్డికి మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు ఎందుకు పెడుతున్నావంటూ.. బుధవారం ఉదయం బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద హోటల్‌లో తన సోదరుడు ఆరిఫ్ పాషాపై సూర సంతోష్, ఓల్లెపు రమేశ్ కత్తులతో దాడి చేశారని తెలిపారు. రెండు వర్గాల నాయకులు మంత్రి శ్రీధర్ బాబు అనుచరులే కావడంతో పోలీస్ స్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వందలాది మంది మైనార్టీలు, వారి అనుచరులు పోలీస్టేషన్ ఎదుట రాస్తారోకోకు యత్నించారు. ఆరిఫ్ పాషా ఠాణాలో ఫిర్యాదు చేయగా.. జీడీనగర్‌కు చెందిన సూర సంతోష్, ఓల్లెపు రమేశ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై స్వామి తెలిపారు. ఆరిఫ్ పాషాపై జరిగిన దాడితో తనకు ఎలాంటి సంబంధ లేదని సమ్మయ్య తెలిపారు.

రంగారెడ్డి జిల్లాలో 46 బస్సులు సీజ్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): పాఠశాలలు పునఃప్రారంభమవడంతో స్కూళ్లు, కాలేజీల బస్సులను ఆర్టీవో అధికారులు తనిఖీ చేశారు. బుధవారం రవాణా శాఖ అధికారులు బృందాలు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు పాటించని పాఠశాల బస్సులను సీజ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగియడంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. పాఠశాల బస్సుల్లో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, ఫైర్ సేఫ్టీకిట్, ఫస్ట్‌ఎయిడ్ కిట్లను అధికారులు తనిఖీ చేశారు.

నీట్ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి

పలు విద్యార్థి సంఘాల డిమాండ్

ఖైరతాబాద్ /ఉస్మానియా యూనివర్సిటీ / హిమాయత్‌నగర్ జూన్ 12 : నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలలో అవకతవకలపై సీబీఐచే విచారణ జరిపించాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. హరియాణాలోని ఒకే పరీక్ష కేంద్రం నుంచి 67 మంది విద్యార్థులు 1వ ర్యాంకు సాధించారని, ఇది అవకతవకలు జరిగిందనడానికి నిదర్శనమని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఝాన్సీ పేర్కొన్నారు. ఈ నెల 14వ ఫలితాలిస్తామని ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారులు 4నే ఫలితాలను వెల్లడించడం పలు అనుమానాలకు తావిస్తున్నదని ఏబీవీపీ నేత రాజు తెలిపారు. బాధ్యులైన వారిని శిక్షించాలని కోరారు. నీట్ పరీక్ష కుంభకోణానికి బాధ్యత వహిస్తూ ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కు మార్‌సింగ్ రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. పరీక్షలకు తిరిగి మళ్లీ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ కోరారు.

అందుబాటులో పుస్తకాలు యూనిఫాంలు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): బడులు తెరుచుకున్న తొలిరోజే విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. పాఠశాలలు పునఃప్రారంభమైన బుధవారం 21,19,439 మంది విద్యార్థులకు జత యూనిఫాం చొప్పున అందజేశామని, ఈ నెలాఖరులోగా రెండోజత కూడా పంపిణీ చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 25,80,291 మంది విద్యార్థులకు 1,50,17,812 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని వెల్లడించింది. ఆరు నుంచి పన్నెండోతరగతి విద్యార్థులకు 1,11,97,976 నోట్‌బుక్‌లను తెప్పించామని, తొలిరోజున 11,65,995 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్టు తెలిపింది. ఒకటి నుంచి ఐదోతరగతి విద్యార్థులు 10,09,464 మందికి తొలిరోజున వర్క్‌బుక్స్ అందజేశామని ప్రకటించింది.

190 కోట్లతో ఫైర్ కేంద్రాల బలోపేతం

15వ ఆర్థిక సంఘం చేయూత • ఎంపోయూ కుదుర్చుకున్న అగ్నిమాపక శాఖ

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఫైర్ కేంద్రాలను బలోపేతం చేయడంలో భాగంగా ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం రూ.190 కోట్ల నిధులను వెచ్చించనున్నాయి. 15వ ఆర్థిక సంఘం రూ.142.61 కోట్లు, రాష్ట్రం వాటాగా రూ.47.53 కోట్లు వెచ్చించనున్నాయి. దీనికి సంబంధించిన ఒప్పందంపై బుధవారం న్యూఢిల్లీలో ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, ఆర్థిక సంఘం అధికారులు సంతకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 18 అగ్నిమాపక కేంద్రాలను మంజూరు చేసింది. వీటికి భవనాలను నిర్మించడానికి, వాహనాలు, యం త్రాలు, పరికరాలను కొనుగోలుకు రూ.57.04 కోట్లు అవసరమవుతాయని అంచనా. 32 మీటర్లు, 104 మీటర్ల ఎత్తు ఉన్న హైడ్రాలిక్ ప్లాట్‌ఫాం, 68 మీటర్ల ఎత్తైన నిచ్చెన, హై ఫైర్ ప్రెషర్ పంపులు 18, ఫైర్ వాహనాలను కొనుగోలుకు రూ.87.57 కోట్లు వ్యయం చేయనున్నారు. రాష్ట్ర కార్యాలయం, పట్టణ ఫైర్ కేంద్రాలు, కంప్యూటర్ సిస్టం అభివృద్ధికి రూ.9.50 కోట్లు, రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రానికి రూ.9.53 కోట్లను వెచ్చిస్తారు. రూ.28.52 కోట్లతో 11 ఫైర్ స్టేషన్‌లు, రెండు ఫైర్ భవనాలను నిర్మించనున్నారు.

నేటితో ముగియనున్న పీజీఈసెట్ పరీక్షలు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పీజీఈసెట్ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెల చివరివారంలో జేఎన్టీయూ అధికారులు ఫలితాలను విడుదల చేయనున్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 89.86శాతం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 80.31శాతం చొప్పున అభ్యర్థులు హాజరైనట్టు కన్వీనర్ ప్రొఫెసర్ అరుణకుమారి తెలిపారు.

జూలై 14న జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఎగ్జామ్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జెన్‌కోలో భర్తీ చేయనున్న అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ), కెమిస్ట్ నియామక రాత పరీక్షలను జూలై 14న నిర్వహించనున్నట్టు జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు షిఫ్టుల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను జూలై 3 నుంచి డౌన్‌లోడ్‌చేసుకోవచ్చని తెలిపారు.

ఉద్యోగాల పెంపుపై ఉద్యమించాలి: బక్క జడ్సన్

చిక్కడపల్లి,జూన్12 : ప్రభుత్వ పోస్టుల పెంపుపై ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ వనరుల రక్షణ సమితి నాయకుడు బక్క జడ్సన్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతూ.. ఎన్నికలు రాగానే లక్ష పోస్టులు భర్తీ చేస్తామని హామీలిచ్చి, అధికారం రాగానే వాటిని మార్చిపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు ఖాళీలపై సమీక్షించలేదని మండిపడ్డారు. అన్ని శాఖల్లో కలిపి 3 లక్షల 70వేల 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటికి అనుకుగుణంగా పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్-అయోధ్య మధ్య ఫ్లైట్ రద్దు

డిమాండ్ లేకపోవడంతో నిలిపివేసిన స్పైస్‌జెట్

ముంబై, జూన్ 12: హైదరాబాద్ నుంచి అయోధ్యకు నేరుగా నడిపే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ప్రకటించింది. రెండు నెలల క్రితం ప్రారంభించిన ఈ విమాన సర్వీసుకు డిమాండ్ లేమి కారణంగా రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్-అయోధ్యల మధ్య వారానికి మూడు సార్లు నడిపే సర్వీసును ప్రారంభించింది. డిమాండ్-సప్లై ఆధారంగా విమాన సర్వీసులను నడుపుతున్నట్లు, ఈ సర్వీసును రద్దు చేసినప్పటికీ చెన్నై-అయోధ్యల మధ్య విమాన సర్వీసును యథాతథంగా నడుపుతున్నట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. అలాగే జనవరి 21 నుంచి ఢిల్లీ నుంచి అయోధ్యకు సంస్థ విమానాన్ని నడుపుతున్నది.

జీవిత బీమాపై రుణాలివ్వాల్సిందే

ఇన్సూరెన్స్ సంస్థలతో ఐఆర్డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 12: అన్ని జీవిత బీమా సేవింగ్స్ ప్లాన్లలో పాలసీ లోన్ సదుపాయం అనేది ఇకపై తప్పనిసరి అని బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ బుధవారం ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. జీవిత బీమా తీసుకున్న పాలసీదారులకు నిబంధనలకు లోబడి వారి పిల్లల ఉన్నత చదువులు, పెండ్లిళ్లు, గృహ నిర్మాణం లేదా కొనుగోలు, వైద్య చికిత్స తదితర నగదు అవసరాలను బట్టి రుణాలు ఇవ్వాల్సిందేనని సదరు సంస్థలకు చెప్తూ ఓ మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. జీవిత బీమా పాలసీలకు సంబంధించి ఉన్న అన్ని రెగ్యులేషన్లను ఏకం చేస్తూ దీన్నిచ్చింది. ఇక పాలసీదారులు తమ పాలసీ నిబంధనలు, షరతులను సమీక్షించేందుకున్న సమయాన్ని (ఫ్రీ లుక్ పీరియడ్) 15 రోజుల నుంచి 30 రోజులకు ఐఆర్డీఏఐ పెంచింది. ఇప్పటికే జనరల్ ఇన్సూరెన్స్ పాలసీల కోసం కూడా ఐఆర్డీఏఐ ఇదే తరహా మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. కాగా, పాలసీలను సరెండర్ చేస్తే పాలసీదారులకు ప్రయోజనకరంగా బీమా సంస్థల నిర్ణయాలుండాలని ఐఆర్డీఏఐ తెలిపింది.

హెల్మెట్లపై జీఎస్టీ ఎత్తేయండి

కౌన్సిల్‌ను కోరిన ఐఆర్ఎఫ్

న్యూఢిల్లీ, జూన్ 12: హెల్మెట్లపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను ఎత్తివేయాలని బుధవారం జీఎస్టీ కౌన్సిల్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలను అంతర్జాతీయ రోడ్డు సమాఖ్య (ఐఆర్ఎఫ్) కోరింది. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ పడుతున్నది. దీంతో దీన్ని సున్నా (నిల్ లేదా జీరో)కు చేర్చాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. హెల్మెట్ల వాడకాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదం చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారన్న ఐఆర్ఎఫ్.. హెల్మెట్లపై జీఎస్టీని తొలగిస్తే వాటి అమ్మకాలు పెరిగి, తద్వారా టూవీలర్ వినియోగదారుల భద్రత కూడా పెరుగుతుందన్నది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాద మరణాల్లో దాదాపు 12 శాతం భారత్‌లోనే సంభవిస్తున్నాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను 15.71-38.81 బిలియన్ డాలర్ల మేర నష్టపరుస్తున్నట్టు బాష్ నివేదిక పేర్కొన్నదని ఐఆర్ఎఫ్ గుర్తుచేసింది.

వాణిజ్య

అత్యంత విలువైన సంస్థగా యాపిల్

న్యూయార్క్, జూన్ 12: ప్రపంచంలో అత్యంత విలువైన సంస్థగా మళ్లీ యాపిల్ అవతరించింది. ఇప్పటి వరకు తొలి స్థానంలో కదలాడిన మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి యాపిల్ తిరిగి తొలి స్థానాన్ని దక్కించుకున్నది. అంతర్జాతీయంగా ఐఫోన్ల అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో కంపెనీ షేరు ధర రికార్డు స్థాయిలో లాభపడటమే ఇందుకు కారణం. కంపెనీ షేరు ధర 4 శాతం లాభపడి 215.04 డాలర్లకు చేరుకోవడంతో కంపెనీ మార్కెట్ విలువ 3.29 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ పడిపోవడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ 3.24 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది.

ఇంజెస్‌తో రెడ్డీస్ జట్టు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్..అమెరికాకు చెందిన ఇంజెస్ ఫార్మాస్యూటికల్స్‌తో జట్టుకట్టింది. క్యాన్సర్ వ్యాధి చికిత్సకోసం వాడే సైక్లోఫాస్ఫామైడ్ ఇంజెక్షన్‌ను అక్కడి మార్కెట్లో విక్రయించడానికి సంస్థతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. 500 ఎంజీ/2.5 ఎంఎల్, 1గ్రాము/5 ఎంఎల్, 2గ్రాము/10 ఎంఎల్ రకాల్లో అమెరికా మార్కెట్లో ఈ ఔషధం లభించనున్నది. మార్చితో ముగిసిన ఏడాది కాలంలో ఈ ఔషధ విక్రయాలు 51.8 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి.

ఆగిన పారిశ్రామిక పరుగు

3 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి • ఏప్రిల్‌లో 5 శాతానికి ఐఐపీ పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 3 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 5 శాతానికే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) పరిమితమైంది. ఈ మేరకు బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. దీన్నిబట్టి గనులు, విద్యుత్తు రంగాల ప్రదర్శన బాగున్నా.. కీలకమైన తయారీ రంగం తీరు పేలవంగా ఉండటమే ఐఐపీ క్షీణతకు కారణంగా నిలుస్తున్నది. ఈ ఏడాది మార్చిలో 5.4 శాతంగా, ఫిబ్రవరిలో 5.6 శాతంగా ఉన్న ఐఐపీ.. జనవరిలో 4.2 శాతంగానే ఉన్నది. మళ్లీ ఇప్పుడు అదే స్థాయి దరిదాపుల్లోకి ఏప్రిల్ గణాంకాలు నమోదయ్యాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఐఐపీ వృద్ధిరేటు 5.9 శాతంగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 5.2 శాతం. ఇకపోతే గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 4.6 శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో ఈసారి ఏప్రిల్‌లో పెరిగినట్టే కనిపిస్తున్నది. కానీ గత మూడు నెలలుగా క్రమేణా గణాంకాలు తగ్గుముఖం పడుతుండటం మాత్రం ఒకింత ఆందోళనే కలిగిస్తున్నది.

రంగాలవారీగా..

తాజా గణాంకాల ప్రకారం.. నిరుడు ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏప్రిల్‌లో గనుల రంగంలో ఉత్పాదకత వృద్ధి 6.7 శాతానికి పెరిగింది. నాడు 5.1 శాతమే. అలాగే విద్యుదుత్పత్తి కూడా 1.1 శాతం నుంచి 10.2 శాతానికి ఎగిసింది. అయితే తయారీ రంగంలో వృద్ధిరేటు ఏప్రిల్‌లో 3.9 శాతానికి క్షీణించింది. పోయినసారి ఏప్రిల్‌లో 5.5 శాతంగా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఐఐపీ ఓవరాల్ గ్రోత్ దెబ్బతిన్నది. దీనికితోడు క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి సైతం 3.1 శాతానికి పతనమైంది. ఏడాది క్రిందట 4.4 శాతంగా ఉన్నదిది. కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి కూడా మైనస్ 2.4 శాతంలోకి దిగజారింది. నిరుడు ఏప్రిల్‌లో 11.4 శాతం వృద్ధి కనిపించింది. అందుకే కన్జ్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 9.8 శాతానికి పుంజుకున్నా ఫలితం లేకపోయింది. నిజానికిది పోయినసారి మైనస్ 2.3 శాతంలో ఉన్నది. మౌలిక, నిర్మాణ రంగాల్లో వృద్ధిరేటూ 8 శాతంగానే ఉన్నది. నిరుడు ఏప్రిల్‌లో 13.4 శాతం. ఇక ప్రైమరీ గూడ్స్ ఉత్పాదక రేటు 1.9 శాతం నుంచి 7 శాతానికి, ఇంటర్మీడియెట్ గూడ్స్ గ్రోత్ 1.7 శాతం నుంచి 3.2 శాతానికి పెరిగినా ఐఐపీని గతంతో పోల్చితే పెంచలేకపోయాయి.

స్వల్పంగా తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల స్వల్పంగా తగ్గింది. మే నెలలో 4.75 శాతంగా నమోదైంది. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.83 శాతంగా ఉన్నది. అయితే నిరుడు మే నెలలో 4.31 శాతంగానే ఉన్నది. దీన్నిబట్టి ఈసారి అర శాతంపైనే పెరిగినట్టైంది. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గరిష్ఠ ద్రవ్యోల్బణం స్థాయి 6 శాతం. కానీ ఆమోదయోగ్య స్థాయి 4 శాతమే. దీంతో ప్రస్తుత గణాంకాలు ఇంకా తగ్గాల్సి ఉన్నది. అప్పుడే వడ్డీరేట్లను తగ్గిస్తామని గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేసినది తెలిసిందే. నిరుడు ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లు యథాతథంగానే కొనసాగుతున్నాయి. చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరిలో వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచింది.

ఇక అప్పట్నుంచి రెపోరేటు 6.5 శాతం వద్దే ఉన్నది. ఫలితంగా గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణా